క్లుప్తంగా

నాగుపాము కలకలం

● పట్టుకున్న స్నేక్ క్యాచర్



పట్టుకున్న నాగుపాముతో నిరంజన్

మార్కాపురం రూరల్: మండలంలోని వేములకోట జగనన్న కాలనీలో సుమారు 6 అడుగుల నాగుపాము జనావాసాల మధ్య బుసలు కొడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. స్థానికులు గుర్తించి స్నేక్ క్యాచర్ నిరంజన్‌కు సమాచారమివ్వడంతో వచ్చి నాగుపామును పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలేశాడు. నాగుపాము కనిపించడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జెడ్పీ విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం సుధాకర్, పీడీ చెంచయ్య

తర్లుపాడు: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి అజయ్ 3 కిమీ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ప్రకాశం జిల్లా తరపున ఎంపికైనట్లు హెచ్‌ఎం సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల కందుకూరులో జరిగిన జిల్లాస్థాయి 3 కిలోమీటర్ల పరుగు పందెం పోటీల్లో విద్యార్థి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు వివరించారు. శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో అజయ్ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. హెచ్‌ఎంతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థు తల్లిదండ్రులు అజయ్‌ను అభినందించారు. పాఠశాల పీడీ చెంచయ్య నాయుడు కృషిని కొనియాడారు.

151 మద్యం బాటిళ్ల పట్టివేత



మద్యం బాటిళ్లను పరిశీలిస్తున్న సీఐ

పొదిలి: అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పొదిలి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ అరుణకుమారి తెలిపారు. సోమవారం రాత్రి సంఘటనకు సంబంధించిన వివరాలను ఆమె మీడియాకు వివరించారు. కొనకనమిట్ల మండలం మునగపాడు గ్రామంలో ఒక వ్యక్తి బెల్ట్ షాపులో మద్యం విక్రయించేందుకు మద్యం నిల్వ చేసుకున్నాడు. సీఐ అరుణకుమారి తన సిబ్బందితో దాడి చేసి అక్రమంగా నిల్వ ఉంచిన 152 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యం నిల్వ ఉంచిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామన్నారు. ఎవరైనా మద్యం బెల్ట్ షాపుల ద్వారా అమ్మితే, విక్రయాలు జరిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా ప్రభుత్వం ప్రైవేట్ మద్యం దుకాణాలు ఓపెన్ చేసిన తర్వాత అధిక మొత్తంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పట్టుకోవటం ఇదే ప్రథమం కావటం గమనార్హం.

చిరుద్యోగుల ఉపాధికి గండి

- ఉద్యోగ భద్రతలేని మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు
- కాంట్రాక్టు కార్మికులను తొలగించిన కూటమి ప్రభుత్వం
- రోడ్డున పడిన కార్మికుల కుటుంబాలు
- ఆందోళన ఉధృతం చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

మార్కాపురం టౌన్:

మార్కాపురం పురపాలక సంఘంలో పారిశుద్ధ్య, ఇంజినీరింగ్, కంప్యూటర్ తదితర విభాగాల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన కార్మికులు పనిచేస్తుంటారు. ప్రభుత్వం నుంచి వచ్చే అరకొర జీతంతో కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అటువంటి కార్మికులను సుమారు 35 మందిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలగించి కూటమి నాయకులు వారికి అనుకూలమైన వారిని నియమించుకున్నారు. దీంతో వీరి జీవితం అగమ్యగోచరంగా మారింది. కాంట్రాక్టు కార్మికుల అక్రమ తొలగింపులను నిరసిస్తూ రెండు నెలల నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట అనేక దఫాలు ధర్నాలు, నిరసన వ్యక్తం చేసినా ఫలితం లేకుండా పోయింది. 20 సంవత్సరాలుగా పార్టీలకు అతీతంగా పనిచేస్తున్నా.. ‘మీరు మా పార్టీ కాదు.. మా వారిని నియమించుకోవాలి’ అంటూ కార్మికులను బలవంతంగా తొలగించి మానసిక వ్యథకు గురిచేస్తున్నారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు పార్టీలను చూడకుండా పాత వారిని కొనసాగిస్తూ అదనంగా కార్మికుల కోసం ప్రభుత్వం నుంచి మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెచ్చుకుని సుమారు 35 మందిని నియమించుకుంది. ఇప్పుడు అలాంటి ప్రయత్నం ఏమీ చేయకుండానే ఉన్న వారికి పార్టీలు ఆపాదించి తొలగించి కొత్త వారిని నియమించుకుంటున్నారు. ఇదేమిటని కాంట్రాక్టు కార్మికులు మున్సిపల్ అధికారులను అడిగితే మాకేమీ తెలియదు.. కూటమి నాయకులు లిస్టు పంపారు, వారిని నియమించుకుంటున్నామని బదులిస్తున్నారని వాపోతున్నారు. కాంట్రాక్టు కార్మికులు 13 రోజులుగా నిరసన రిలే దీక్షలు నిర్వహిస్తున్నారు. ఆందోళనలను ఉధృతం చేసి పోరాడుతున్నారు. అయితే అటు అధికారులు కానీ, నాయకులు కానీ స్పందించకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చింది నామం పెట్టింది..

రాష్ట్రంలో అధికారంలోకి రాకముందు కూటమి నాయకులు మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి, ఉద్యోగ భద్రత, ఉపాధి కల్పించి ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీల మీద హామీలు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి కల్పన ఏమోకానీ ఉన్న కాంట్రాక్టు ఉద్యోగం ఊడిందని కార్మికులు వాపోతున్నారు. మార్కాపురం పురపాలక సంఘంలో మున్సిపల్ కమిషనర్‌కు, కీలకంగా ఉన్న మరో కార్యాలయ ఉద్యోగికి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతోందని సీఐటీయూ నాయకులు పేర్కొంటున్నారు. కాంట్రాక్టు ఉద్యోగంతో చాలీచాలని జీతాలతో ఎలాగోలా జీవితాన్ని నెట్టుకొస్తున్నారని, ఆ ఉద్యోగాన్ని కూడా తొలగిస్తే ఎలా అని నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెప్పేది ఒకటి, చేసేది ఒకటిగా ఈ కూటమి ప్రభుత్వ వ్యవహార తీరును వివిధ కార్మిక సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

రాజకీయ తొలగింపులు మాత్రమే ఇవి



కాంట్రాక్టు ఉద్యోగుల పట్ల రాజకీయ తొలగింపుల్లా ఉన్నాయి. వీరు 20 ఏళ్లుగా పనిచేస్తున్నారు. అప్కాస్ ద్వారా వీరు జీతాలు పొందుతూ పీఎఫ్, ఈఎస్ఐ పొందుతున్నారు. పనితీరును బట్టి పరిశీలించి వారికి నోటీసులు ఇచ్చి తొలగించాలి. ఎలాంటి నిబంధనలు పాటించకుండా వీరిని తొలగించటం అన్యాయం.

– సోమయ్య, సీపీఎం టౌన్ సెక్రటరీ

ఉద్యోగమే ఆధారం



కాంట్రాక్టు ఉద్యోగంతోనే నేను నా కుటుంబాన్ని పోషించుకుంటున్నా. పురపాలక సంఘంలో సుమారు 18 ఏళ్ల నుంచి ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్నాను. గత ప్రభుత్వాల్లో కూడా నా ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొచ్చాను. పార్టీలకు అతీతంగా పని చేశాను. ఇప్పుడు ఉద్యోగం నుంచి తొలగించి వేరే వారిని నియమించుకోవటంతో నా పరిస్థితి అర్థం కావటంలేదు.

– హరికృష్ణ, కాంట్రాక్టు ఉద్యోగి

నాతో పాటు 35 మంది రోడ్డున పడుతున్నారు



నాతో పాటు మున్సిపాల్టీలో సుమారు 35 మంది కాంట్రాక్టు ఉద్యోగులు రోడ్డున పడుతున్నాం. మున్సిపల్ అధికారులు చెప్పిన విధులు నిర్వర్తిస్తున్నాం. అప్కాస్ ద్వారా ఉద్యోగ భద్రత ఉందనుకుంటే ఇప్పుడు అనధికార తొలగింపులతో మానసిక వ్యథకు గురవుతున్నాం. నిరుద్యోగిగా మారాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– ఎస్‌కే ఇబ్రహీం సలాం, కాంట్రాక్టు ఉద్యోగి

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థుల ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థులు



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గిద్దలూరు రూరల్: ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం విద్యార్థులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకుడు తేజ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెనను వెంటనే విడుదల చేయాలన్నారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు కేటాయించి మెస్ చార్జీలు రూ.3 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పై స్పష్టత ఇవ్వాలన్నారు. జిల్లా యూనివర్సిటీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. డిగ్రీలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనియన్ సభ్యులు కొమ్మునూరి నవీన్, అమర్నాథ్, కార్తీక్, వినోద్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

మార్కాపురం: జిల్లా వ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్ ఇతర కోర్సుల్లో చదువుతున్న 47,423 మంది విద్యార్థులకు 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పెండింగు ఫీజు బకాయిలను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివసాయికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి అనంతరం సబ్ కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక క్వార్టర్ నిధులు మాత్రమే విడుదల చేశారని, మిగిలిన 3 క్వార్టర్ నిధులు విడుదల చేయలేదని పేర్కొన్నారు. గతేడాదికి సంబంధించి 109 కోట్ల 32 లక్షల 89 వేల 253 రూపాయల బకాయిని వెంటనే చెల్లించాలని కోరారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 3వ క్వార్టర్ గడుస్తున్నా ఇంకా నిధులు విడుదల చేయలేదని, మొత్తం రూ.218 కోట్ల బకాయి పెండింగు ఉందని తెలిపారు. సంక్షేమ హాస్టళ్లకు మెస్ చార్జీలు పెండింగులో ఉన్నాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కోరారు. తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు వెంటనే అమలు చేయాలని, మార్కాపురంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. మార్కాపురం మెడికల్ కళాశాల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనివాసులు, చరణ్, దేవదాసు, జాన్సన్, సాయి, డి.సోమయ్య పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రేష్ఠ

బేస్తవారిపేట: మహిళలు క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని అంకాలజీ డాక్టర్ శ్రేష్ఠ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశహాలులో సోమవారం ఒంగోలు హెచ్‌సీజీ ఎంఎస్ఆర్ క్యాన్సర్ వైద్యశాల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం, వైద్య పరీక్షలు నిర్వహించారు. శరీరంలో కణాలు అసమానమైన పెరుగుదలతో ఇతర అంగాలపై దాడి చేస్తాయన్నారు. 25–45 ఏళ్లలోపు మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. తల్లిదండ్రుల్లో ఎవరికైనా ఉంటే 5 శాతం క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. పొత్తికడుపు వెడల్పుగా ఉండటం, రుతుస్రావం క్రమం తప్పడం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు ఉంటే గర్భాశయ క్యాన్సర్ పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. ఇది 60–65 ఏళ్ల వయస్సు వారికి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ సీడీపీఓ నీలోఫర్, వైద్యశాల అసోసియేట్ మేనేజర్ ప్రభాకర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీలోని పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకుడు టి.ఆవులయ్య అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఫెడరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సీపీఎం నాయకులు కార్మికుల సమస్యలపై స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వారి సమస్యల పై అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆవులయ్య మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా ఆధారంగా పారిశుద్ధ్య కార్మికులను నియమించాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు జీవో నంబర్ 11 ప్రకారం స్కిల్, సెమీస్కిల్డ్ ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. కార్మికులందరికీ రూ.21000 జీతం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మురళి, పాపయ్య, బాలయ్య, రవికుమార్, ఐ.చంటయ్య, చెన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు అందక విద్యార్థుల అవస్థలు



కందులాపురం-2 సచివాలయం వద్ద లైన్లో నిల్చున్న విద్యార్థులు

కంభం: కందులాపురం–2 సచివాలయంలో ఉన్న ఆధార్ సెంటర్ వద్దకు విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో వస్తుండటంతో కొందరికే సేవలందగా మరి కొందరు వెనుతిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కంభం మండలంలో కంభం–2 సచివాలయం, కందులాపురం–2 సచివాలయం, పెద్దనల్ల కాల్వ సచివాలయంలో మాత్రమే ఆధార్ సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. రెండు నెలలుగా కంభం–2 సచివాలయం పరిధిలో ఉన్న డిజిటల్ అసిస్టెంట్ మెడికల్ లీవ్‌లో ఉండటంతో అక్కడ సర్వీసులు ఆగిపోయాయి. పెద్దనల్ల కాల్వ సచివాలయం వెళ్లాలంటే స్థానికంగా ఉండే వారికి, చుట్టు పక్కల గ్రామాల వారికి దూరమవుతుంది. దీనికి తోడు అర్థవీడు, బేస్తవారిపేట మండలాల్లో సైతం ఎక్కడా ఆధార్ కేంద్రాలు పని చేయకపోవడంతో వారు కూడా కంభం రావాల్సిన పరిస్థితి. ప్రస్తుతం పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులు తమ ఆధార్ కార్డుల్లో వయస్సు, ఇతర తప్పులు ఉంటే సరిచేసుకోవడం కోసం వస్తున్నారు. మూడు మండలాల ప్రజలు, విద్యార్థులు అంతా నిత్యం కందులాపురం–2 సచివాలయానికి వస్తుండటంతో పనులు జరగక ఇబ్బందులు పడుతున్నారు. ఆపరేటర్ లేని కంభం–2 సచివాలయంలో మరో ఆపరేటర్‌ను నియమించడంతో పాటు, అర్థవీడు, బేస్తవారిపేట మండలాల్లో ఆధార్ సర్వీసులు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ప్రజలు కోరుతున్నారు.

వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులకు ప్యాకేజీ ఇవ్వాలి



నినాదాలు చేస్తున్న సీపీఐ నేతలు



కంభంలో నిరసన తెలుపుతున్న నాయకులు

మార్కాపురం: వెలుగొండ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే 2 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని సీపీఐ ఏరియా కార్యదర్శి అందె నాసరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ ప్రదర్శన చేసి కార్యాలయంలో నినాదాలు చేసి సబ్ కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చి 4 నెలలైనా వెలుగొండపై ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఎన్నికల ప్రచార సభల్లో తాము అధికారంలోనికి వస్తే వెలుగొండ ప్రాజెక్టుకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు కేటాయిస్తామని చెప్పారని గుర్తుచేశారు. ఆర్‌ఆర్ ప్యాకేజీని అమలు చేస్తూ పునరావాస కాలనీల్లో అన్నీ వసతులు కల్పించి త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే వెలుగొండ నీటిని వదలాలన్నారు. పార్టీ నాయకులు ఎస్‌కే ఖాశిం పాల్గొన్నారు.

బేస్తవారిపేటలో..

బేస్తవారిపేట: వెలిగొండ ప్రాజెక్ట్ పరిధిలోని 7500 మందికి ఆర్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కే వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ జితేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీ జోసఫ్, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఢాకాల పుల్లయ్య, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఆర్ యోగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వేల్పుల అంకయ్య, సీపీఐ కంభం మండల కార్యదర్శి ఏలెం శ్రీనివాసులు పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టు పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి

కంభం: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని ఏపీ రైతుసంఘం నియోజకవర్గ కార్యదర్శి డొక్కా పుల్లయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి తహసీల్దార్ కిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీల నాయకులు జోసెఫ్, యోగయ్య, అంకయ్య, శ్రీనివాసులు, షంషీర్ బేగ్, పాల్గొన్నారు.

తర్లుపాడులో..

తర్లుపాడు: వెలుగొండ ప్రాజెక్టుకు 2 వేల కోట్ల నిధులు కేటాయించి నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. సీపీఐ నాయకులు వీరయ్య, పీవీ కొండయ్య, కోటయ్య పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో పొదిలి యువకుడి ప్రతిభ




శ్రీనివాసరావుకు పతకం ఇచ్చి సత్కరిస్తున్న నిర్వాహకులు

పొదిలి రూరల్: స్విమ్మింగ్ పోటీల్లో పొదిలి మండలం ఉప్పలపాడు పంచాయతీ గోగినేనివారిపాలేనికి చెందిన గోపనబోయిన శ్రీనివాసరావు సత్తా చాటాడు. ఆదివారం గుంటూరులోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ ఆమెచ్యూర్ అక్వాటిక్ అసోసియేషన్, ఏపీఏఏ, జీడీఎస్ఏ అనుబంధంగా 5వ మాస్టర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్ 2024లో నిర్వహించారు. 30 ఏళ్ల శ్రీనివాసరావు పోటీల్లో పాల్గొనడం మంచిదన్నారు. 400 మీటర్లు వ్యక్తిగత విభాగంలో సిల్వర్ మెడల్, 100 మీటర్లు బ్యాక్ స్ట్రోక్‌తో విభాగంతో సిల్వర్ మెడల్, 50 మీటర్లు బ్రెస్ట్ స్ట్రోక్ విభాగంలో బ్రాంచ్ మెడల్, 50 మీటర్లు బ్యాంక్ స్ట్రోక్ విభాగంలో బ్రాంచ్ మెడల్‌లో మొత్తం నాలుగు పతకాలు సాధించారు. స్విమ్మింగ్ పోటీల్లో నాలుగు పతకాలు సాధించిన శ్రీనివాసరావుకు పొదిలికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి పొదిలికి మంచి పేరు తీసుకు రావాలని కోరారు.

సత్వర చికిత్సే శ్రీరామరక్ష

- బ్రెయిన్ స్ట్రోక్‌పై వైద్య నిపుణుల సూచన
- నేడు బ్రెయిన్ స్ట్రోక్ డే

ఒంగోలు టౌన్: బ్రెయిన్ స్ట్రోక్ బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. బ్రెయిన్ స్ట్రోక్‌ను సామాన్యుల పరిభాషలో పక్షవాతం అంటారు. దీని బారిన పడిన వారి జీవితం దుర్భరం అవుతుంది. ఒకచేయి, ఒకకాలు పనిచేయకపోవడం, మాట రాకపోవడం లాంటి వాటితో ఇబ్బంది పడుతుంటారు. మారిన జీవనశైలి, మానసిక ఒత్తిడి, ఉప్పు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం, ధూమపానం, మద్యపానం అలవాట్ల వలన బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడుతున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. మెదడులో రక్తం గడ్డకట్టడం, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ తదితర కారణాల వలన కూడా బ్రెయిన్ స్ట్రోక్ వస్తుందని వైద్యులు చెబుతున్నారు. మానసిక ఒత్తిడికి గురైన వారిలో మెదడులో రక్తం గడ్డకడుతుంది. దీనివలన మెదడులో రక్త ప్రసరణ సరిగా జరగదు. బీపీ అదుపులో లేకుండాపోవడంతో మెదడులోని నరాలలో రక్తస్రావం జరుగుతుంది. దీని వలన పక్షవాతం వస్తుంది. 18 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన వారు వెంటనే మద్యం, ధూమపానం అలవాట్లను మానివేయం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఇందుకోసం ప్రత్యేక వైద్యం అందుబాటులో ఉంది. ప్రతిరోజూ ఇక్కడకు వైద్యం కోసం రెండంకెల్లో రోగులు వస్తున్నారు. బ్రెయిన్‌లో రక్తం గడ్డకట్టిన వారికి ఆపరేషన్లు కూడా చేస్తున్నారు. ప్రతి నెలా 200కుపైగా జీజీహెచ్‌లో శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌కు సత్వర చికిత్సే శ్రీరామరక్ష అని వైద్యులు చెబుతున్నారు.



బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు...

- మొహం, చేయి, కాలు తదితర భాగాలలో తిమ్మిరి. ఆయా భాగాలు బలహీనంగా అనిపించడం..
- ఒక కన్ను లేదా రెండు కళ్లలో ఆకస్మికంగా చూపు మందగించడం..
- ఆకస్మికంగా మాటలు తడబడటం. మాట్లాడేటప్పుడు మూతి వంకర పోవడం. మాటలో తేడా స్పష్టంగా కనిపించడం..
- ఉన్నట్టుంది ఒక్కసారిగా భరించలేని తలనొప్పి..
- మైకం వచ్చినట్లు మనిషి నడకలో మార్పు. నడవడానికి ఇబ్బంది పడటం..

గోల్డెన్ అవర్‌లో చికిత్స చేయడం ప్రధానం...

పక్షవాతం వచ్చిన వారిని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా వైద్యశాలకు తరలించాలి. దీనినే గోల్డెన్ అవర్ అంటారు. మనిషికి స్ట్రోక్ వచ్చిన తర్వాత ప్రతి నిముషం అత్యంత విలువైందని గుర్తించాలి. తక్షణమే పక్షవాతానికి చికిత్స చేయకపోతే మెదడు శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ రోగులను సకాలంలో గుర్తించడం వలన ఎఫ్ఏఎస్‌టీ అనే విధానం ద్వారా చికిత్స చేస్తారు. దీని వలన ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చు. మెదడు దెబ్బతినకుండా కాపాడవచ్చు. సాధ్యమైనంత త్వరగా చికిత్సకు తీసుకెళ్తే ఆల్టప్లెస్, లేదా టెనెక్ట్‌ప్లెస్‌తో థ్రోంబోలైటిక్ చికిత్స చేసి మెదడులో రక్తం గడ్డకట్టకుండా చేస్తారు. మరికొంత మందికి మెకానికల్ థ్రోంబెక్టమీ చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి కాపాడతారు. అయితే, పక్షవాతం వచ్చే ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిమీద అవగాహన కలిగి ఉండాలి.


బ్రెయిన్ స్ట్రోక్‌కు ఆధునిక చికిత్స



బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడిన వారిని ఆలస్యం చేయకుండా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించాలి. ఇప్పుడు అల్లోపతి వైద్యంలో ఎంతో మెరుగైన చికిత్స ఉంది. మెదడులో రక్తం గడ్డకట్టినప్పటికీ క్షణాల్లో కరిగించే వైద్యం అందుబాటులో ఉంది. ఆలస్యమయ్యేకొద్దీ రోగి మరింత ప్రమాదంలో పడతాడు. చికిత్స కూడా కష్టతరమవుతుంది. ఒక్కోసారి ప్రాణాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉంది. అంతకంటే ముందుగా వయసుతో నిమిత్తం లేకుండా మద్యపానం, ధూమపానం అలవాట్లను మానుకోవాలి. ఒత్తిళ్లకు దూరంగా ప్రశాంతంగా జీవించాలి. రక్తపోటు ఉన్నవారు అదుపులో ఉంచుకోవాలి.

డాక్టర్ కసుకుర్తి అనిల్‌కుమార్, న్యూరాలజిస్టు

మున్సిపల్ స్థలం ఆక్రమణకు యత్నం



మున్సిపల్ స్థలాన్ని చదును చేస్తున్న జేసీబీ

మార్కాపురం టౌన్: పట్టణంలోని కొండేపల్లి రోడ్డులో మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు కొందరు సోమవారం యత్నించారు. స్థలంలో గతంలో నిరుపయోగంగా ఉన్న మున్సిపల్ టాయిలెట్లను జేసీబీతో తొలగించి చదును చేశారు. గత ప్రభుత్వంలో స్థలంలో సచివాలయం, గ్రంథాలయం, బీసీ కమ్యూనిటీ హాలుకు కేటాయించే విధంగా ప్రతిపాదనలు పంపారు. కూటమి ప్రభుత్వం రావడంతో ఓ సామాజిక వర్గానికి చెందిన కొందరు ప్రార్థనలు నిర్వహించుకునేందుకు భవనాన్ని నిర్మించే ప్రయత్నం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ సామాజిక వర్గానికి చెందిన వారికి కూతవేటు దూరంలో ప్రార్థనా మందిరం ఉండటంతో రెండు ఎందుకని అక్కడ ఉన్న స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఫొటోలతో సహా సమాచారం ట్రెండ్ అవుతున్నా మున్సిపల్ అధికారులు ఆ వైపు కూడా కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఈ విషయంపై మున్సిపల్ అధికారులను వివరణ కోరగా స్పందించ లేదు.

పొదుగు వాపు వ్యాధితో జాగ్రత్త

గిద్దలూరు రూరల్: పాడిరైతులు పొదుగు వాపు వ్యాధిలో జాగ్రత్తలు పాటించాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు యు.యోగానంద ప్రసాద్ సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని కొండపేట గ్రామానికి చెందిన పాడిరైతు శీలంశ్రీనివాసరెడ్డి పాడిగేదె పొదుగు వాపు వ్యాధికి గురై చికిత్స నిమిత్తం సోమవారం స్థానిక పశువైద్యశాలకు వచ్చి వైద్య సేవలను పొందుతున్న సందర్భంగా యోగానందప్రసాద్ పాడిరైతులకు పొదుగు వ్యాపు వ్యాధిపై అవగాహన కల్పించారు. తొలిసారి ఈనే గేదెలకు ఎక్కువగా పొదుగు వాపు వ్యాధి వచ్చే అవకాశాలుంటాయన్నారు. పొదుగు వాపు రాకుండా ఉండాలంటే గేదెలు చూడి మీద ఉన్న సమయంలో రైతులు కడిగేటప్పుడు పొదుగు పట్టుకుంటూ కడగడం వల్ల వాటికి గిలిగింతలు తగ్గి వాపు రాకుండా ఉంటుందన్నారు. పాలు పిండేవారు తొలిసూరి గేదెలకు నెమ్మదిగా పితకాలన్నారు. పాలు తీయనివ్వకుండా గేదెలు ఎగిరినప్పుడు గట్టిగా పట్టుకుని పాలు తీస్తారని, అలా చేయడం వల్ల పొదుగు వాపు వ్యాధి వచ్చే అవకాశాలున్నాయన్నారు. అంతే కాకుండా వాపు కారణంగా వాపునకు గురైన రొమ్ము నుంచి పాలు రాకుండా గట్టిపడి నిరుపయోగంగా ఉండిపోతాయన్నారు.

మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే చర్యలు

కొమరోలు: మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లు నాయక్ హెచ్చరించారు. కొమరోలులోని నాలుగు రోడ్ల కూడలి వద్ద సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్లను ఆపి ఎస్సై వెంకటేశ్వర్లు నాయక్ కౌన్సెలింగ్ ఇచ్చారు. 12 ద్విచక్ర వాహనాలకు జరిమానా విధించారు. ఎస్సై మాట్లాడుతూ మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపరాదని, ఎవరైనా ఈసారి ద్విచక్ర వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలను తల్లిదండ్రులు మైనర్లకు ఇవ్వరాదని, అలా ఇచ్చినట్లయితే తల్లిదండ్రులను పోలీసు స్టేషన్‌కు పిలిపిస్తామని తెలిపారు.